క్లుప్తంగా

ఉత్సాహంగా షటిల్ టోర్నమెంట్



మైలవరం: ఎస్ఎస్ బ్యాడ్మింటన్ ఎరీనా ఆధ్వర్యంలో మైలవరంలోని వివిధ పాఠశాలల విద్యార్థులకు ఆదివారం షటిల్ బ్యాడ్మింటన్ డబుల్స్ పోటీలు నిర్వహించారు. అండర్–11 విభాగంలో వరుణ్‌తేజ్, హితాన్ష ప్రథమ స్థానంలో నిలిచారు, సతీష్, సాయి మణికంఠ ద్వితీయ స్థానం, బిలాల్, భరద్వాజ్ తృతీయ స్థానం సాధించారు. అండర్–13 విభాగంలో ప్రవీణ్, హర్షిత్ ప్రథమస్థానం, వరుణ్, హితాన్ష ద్వితీయ స్థానం, అఖిల్, ఎస్కే ముబీన్ తృతీయస్థానంలో నిలిచారు. అండర్–15 విభాగంలో పవన్, అభి ప్రథమస్థానం, రాకేష్, మహేష్ ద్వితీయస్థానం, హర్షిత్, ప్రవీణ్ తృతీయస్థానం సాధించారు. విజేతలకు షీల్డ్, మెడల్స్, సర్టిఫికేట్లను అందజేశారు. చనుమోలు నాగభూషణం, ఎరీనా సభ్యులు పాల్గొన్నారు.

ముగిసిన షాబుఖారి దర్గా ఉరుసు



కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలో సుప్రసిద్ధ పుణ్యక్షేత్రం హజరత్ సయ్యద్ షాబుఖారి బాబా దర్గా ఉరుసు ఉత్సవాలు శనివారం రాత్రితో ముగిశాయి. ముగింపు వేడుకల్లో ఎంపీ కేశినేని శివనాథ్ (చిన్ని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్, ఎమ్మెల్సీ టీడీ జనార్దన్, టీడీపీ అధికార ప్రతినిధి నాగుల్‌మీరా పాల్గొన్నారు. ఉరుసు ఉత్సవ కమిటీ చైర్మన్ అల్తాఫ్ రాజా అతిథులను ఆహ్వానించి ప్రార్థనలు జరిపారు. అన్నదానం చేశారు.

సీసీ రోడ్డు ప్రారంభం



జి.కొండూరు: జి.కొండూరు మండలం దుగ్గిరాలపాడు, గంగినేని, తెల్లదేవరపాడు, చెరువు మాధవరం గ్రామాల్లో గోకులాలు, సీసీ రోడ్లను విజయవాడ ఎంపీ కేశినేని శివనాథ్(చిన్ని), ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణ ప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఎంపీ మాట్లాడుతూ సీసీ రోడ్ల నిర్మాణంతో గ్రామాలు నూతన శోభను సంతరించుకున్నాయన్నారు. అనంతరం సున్నంపాడు గ్రామంలో సీఎంఆర్ఎఫ్ చెక్కులను లబ్ధిదారులకు అందజేశారు. జనసేన నాయకుడు అక్కల రామ్మోహనరావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

స్టడీ మెటీరియల్ పంపిణీ

గానుగపాడు(తిరువూరురూరల్): త్వరలో జరుగనున్న పదో తరగతి పబ్లిక్ పరీక్షలకు హాజరయ్యే విద్యార్థుల కోసం ఐక్యోపాధ్యాయ ఫెడరేషన్ రూపొందించిన స్టడీ మెటీరియల్‌ను ఆదివారం గానుగపాడు జెడ్పీ ఉన్నత పాఠశాలలో పంపిణీ చేశారు. యూటీఎఫ్ జిల్లా గౌరవాధ్యక్షుడు మచ్చా శ్రీనివాసరావు వితరణతో స్టడీమెటీరియల్‌ను పాఠశాల విద్యార్థులకు అందజేశారు. ఉపాధ్యాయులు రాజేంద్రప్రసాద్, రాంప్రదీప్, సుదర్శన్ పాల్గొన్నారు.

తాటిచెట్టు పైనుంచి పడి గీత కార్మికుడి మృతి

తిరువూరు: స్థానిక రాజుపేటకు చెందిన గీత కార్మికుడు బజ్జూరి నరసింహారావు(55) తాటిచెట్టుపై నుండి కిందపడి అక్కడికక్కడే మృతిచెందారు. తిరువూరు బైపాస్‌రోడ్డులో కల్లు గీత నిమిత్తం తాటిచెట్టు ఎక్కిన నరసింహారావు మోకు తెగడంతో జారి కింద పడిపోయారు. మృతుడికి భార్య, కుమార్తె ఉన్నారు. స్థానిక ప్రభుత్వాసుపత్రిలో ఆయన మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించిన పోలీసులు కేసు నమోదు చేశారు.

టీడీపీ వార్డు సభ్యులు ముగ్గురు రాజీనామా

చాట్రాయి: టీడీపీకి చెందిన ముగ్గురు వార్డు సభ్యులు తమ పదవులకు ఆదివారం రాజీనామా చేశారు. పార్టీ కోసం 20 ఏళ్లుగా కష్టపడి పనిచేస్తున్న కార్యకర్తలకు గుర్తింపు లేదని ఈ సందర్భంగా వారు ఆవేదన వ్యక్తం చేశారు. మండలంలోని నరసింహారావుపాలెం గ్రామంలో సొసైటీ అధ్యక్ష పదవికి కట్టా దుర్గ పేరు ఖరారు కావడంతో పంచాయతీ వార్డు సభ్యులు చింతల మోహనరెడ్డి, అందె కృష్ణ, కంచపోగు వీరయ్య పార్టీలో తమకు గుర్తింపు లేదంటూ రాజీనామా చేశారు. గ్రామ పార్టీ అంతా కలిసి చింతల మోహనరెడ్డి పేరు ఖరారు చేయగా మండల పార్టీ నాయకుడు బొట్టు లక్ష్మణరావు కట్టా దుర్గా అనే వ్యక్తిని సొసైటీ అధ్యక్షుడిగా ఖరారు చేసి మంత్రి పార్థసారథికి అందజేశారు. దీంతో పార్టీకి మొదటి నుంచి కష్టపడిన కార్యకర్తలకు ప్రాధాన్యత ఇవ్వకుండా ఇటీవల పార్టీలోకి వచ్చిన వారికి పదవి ఖరారు చేయడంపై నిరసన వ్యక్తం చేసిన వార్డు సభ్యులు తమ పదవికి రాజీనామా చేశారు. వీరికి 150 మంది టీడీపీ కార్యకర్తలు మద్దతు పలికారు.

సంక్రాంతిని సంప్రదాయంగా జరుపుకుందాం



భోగి మంటలను వెలిగిస్తున్న మంత్రి పార్థసారథి



జి.కొండూరు వేడుకల్లో ఎమ్మెల్యే వసంత

మంత్రి పార్థసారథి

చాట్రాయి: సంక్రాంతి పండుగను సంప్రదాయంగా జరుపుకుందామని రాష్ట్ర గృహ నిర్మాణ శాఖా మంత్రి కొలుసు పార్థసారథి పిలుపునిచ్చారు. ఆదివారం మండలంలోని కొత్తగూడెం గ్రామంలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. కోడి పందేలు, జూదాలకు తావివ్వకుండా కుటుంబ సమేతంగా సంప్రదాయంగా పండుగను చేసుకోవాలని ఆయన సూచించారు.

ఈ సందర్భంగా గంగిరెద్దులాట, హరిదాసుల పద్యాలతో భోగి మంటలను వెలిగించి, మహిళలు వేసిన రంగవల్లికలను పరిశీలించారు. కార్యక్రమంలో నూజివీడు సబ్ కలెక్టర్ స్మరణ్‌రాజ్, నూజివీడు డీఎస్పీ ప్రసాద్, టీడీపీ నాయకులు సుబ్రహ్మణ్యం, రఘునాథ్, మరిడి చిట్టిబాబు, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంప్రదాయంగా సంక్రాంతి సంబరాలు

జి.కొండూరు: సంప్రదాయబద్ధంగా సంక్రాంతి వేడుకలు జరుపుకోవాలని ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ అన్నారు. జి.కొండూరులో నిర్వహించిన సంక్రాంతి సంబరాలకు ఎమ్మెల్యే తన భార్య వసంత శిరీషతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా నిర్వహించిన ముగ్గుల పోటీలు, కబడ్డీ పోటీలు, గోమాతలు, గంగిరెద్దుల విన్యాసాలను తిలకించారు. స్థానిక నాయకులతో కలిసి కోడి పుంజులతో ఫొటోలు దిగారు. ముగ్గుల పోటీల విజేతలకు బహుమతులు అందజేశారు.

మహిళలకు ముగ్గుల పోటీలు..

తిరువూరు: తిరువూరు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో ఆదివారం స్థానిక ఫ్యాక్టరీ సెంటర్‌లో మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. సంక్రాంతి సందర్భంగా జరిపిన పోటీల్లో దారా దీప్తి, జూలూరు వాసవీ శర్వాణి, జల్లి సుజాత ప్రథమ, ద్వితీయ, తృతీయ బహుమతులు సాధించారు. మ్యూజికల్ చైర్స్‌లో రెబ్బ సునీత, పరిసె రాజేశ్వరి, పూర్ణిమ మొదటి మూడు బహుమతులు గెలుచుకున్నారు. ఆర్యవైశ్య మహిళా విభాగం మండల అధ్యక్ష, కార్యదర్శులు అనుమోలు అర్పిత, దారా మంజు, కంచర్ల శశికళ, వాసవీ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు సముద్రాల కిరణ్‌కుమార్, గుర్రం పవన్, చిత్తలూరి నాగలక్ష్మి, కొత్తగుండ్ల ప్రసాదరావు, నాళ్లా వెంకట రామారావు తదితరులు పాల్గొన్నారు.



తిరువూరులో ముగ్గు వేస్తున్న మహిళ

సమస్యల పరిష్కారానికి కృషి చేయండి

మాజీ ఎమ్మెల్యే మేకా ప్రతాప్ అప్పారావు



ప్రతాప్ అప్పారావును కలిసిన వైఎస్సార్ సీపీ మండలాల అధ్యక్షులు

నూజివీడు: వైఎస్సార్ సీపీ బలోపేతానికి ప్రతి ఒక్కరూ కృషి చేయాలని మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నూజివీడు పట్టణ అధ్యక్షుడిగా శీలం రాము, నూజివీడు మండల అధ్యక్షుడిగా పోలిమెట్ల నాగ శివకుమార్, ఆగిరిపల్లికి బెజవాడ రాంబాబు, ముసునూరుకు మూల్పూరి నాగవల్లేశ్వరరావు, చాట్రాయికి పుచ్చకాయల సుబ్బారెడ్డి ఇటీవల నియమితులయ్యారు. వారంతా ఆదివారం మేకా వెంకట ప్రతాప్ అప్పారావును మర్యాదపూర్వకంగా కలిసి కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రతాప్ అప్పారావు మాట్లాడుతూ పదవులు పొందిన వారు నాయకులు, కార్యకర్తలను కలుపుకొని వెళ్లాలని, ప్రజా సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందించి వాటి పరిష్కారానికి కృషి చేయాలన్నారు. కౌన్సిలర్ నవుడు నాగమల్లేశ్వరరావు, నాయకులు బసవా వినయ్, పలగాని నరసింహారావు, కాలి సుగుణరావు తదితరులు పాల్గొన్నారు.

ప్రతి వస్తువుకు బిల్లు తీసుకోవాలి

న్యాయమూర్తి నేలపూడి చిరంజీవి



మాట్లాడుతున్న న్యాయమూర్తి చిరంజీవి

జి.కొండూరు: కొనుగోలు చేసే ప్రతి వస్తువుకు బిల్లు తీసుకున్నప్పుడే ఆ వస్తువులకు సమస్య తలెత్తినప్పుడు న్యాయపరంగా ముందుకు సాగే అవకాశం ఉంటుందని న్యాయమూర్తి నేలపూడి చిరంజీవి అన్నారు. కవులూరు గ్రామంలోని ధన్వంతరి వైద్యశాలలో ధన్వంతరి చారిటబుల్ ట్రస్ట్, జిల్లా వినియోగదారుల కమిషన్ విజయవాడ వారి ఆధ్వర్యంలో వినియోగదారుల హక్కులు, పరిరక్షణపై అవగాహన సదస్సు ఆదివారం నిర్వహించారు. న్యాయమూర్తి చిరంజీవి మాట్లాడుతూ రూ.5లక్షల వరకు విలువ గల వస్తువులకు సమస్య తలెత్తినప్పుడు ఎలాంటి ఖర్చులు లేకుండా వినియోగదారులు ఉచితంగా న్యాయం పొందవచ్చని వివరించారు. వినియోగదారుల హక్కులు, న్యాయ సలహాలు తీసుకునే విధానంపై అవగాహన కల్పించారు. వినియోగదారుల కోర్టు సభ్యుడు ఏవీ రమణ, పోక్సో కోర్టు మాజీ పీపీ జి.నారాయణరెడ్డి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ జువ్వా వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

పలుచోట్ల బరులు ధ్వంసం



టెంట్‌ను తొలగిస్తున్న పోలీసు అధికారులు



ఈదరలో బరులను ధ్వంసం చేస్తున్న పోలీస్ సిబ్బంది

నూజివీడు: కోడిపందేల నిర్వహణకు పట్టణంలోని మైలవరం రోడ్డులో ఏర్పాటు చేసిన బరిని ఆదివారం పట్టణ సీఐ పి. సత్య శ్రీనివాస్, ఎస్ఐ జ్యోతి బసు తొలగించారు. సిద్ధం చేసిన కోడి పందేల బరిని ట్రాక్టర్‌తో దున్నించారు. గత రెండు రోజులుగా పోలీసులు పెద్దఎత్తున ఒకవైపున బరులను ధ్వంసం చేస్తున్నా మరోవైపు నుంచి నిర్వాహకులు బరులను సిద్ధం చేస్తూనే ఉన్నారు. సీఐ మాట్లాడుతూ ప్రజలు కుటుంబ సభ్యులతో పండుగను ఆనందంగా జరుపుకోవాలని, కోడిపందేలకు, ఇతర జూదాలకు వెళ్లి ఆర్థికంగా నష్టపోవద్దన్నారు. సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, షటిల్, క్రికెట్ వంటి పోటీలను నిర్వహిస్తే యువతకు క్రీడల పట్ల ఆసక్తి పెరుగుతుందని చెప్పారు. కోడిపందేలకు ఎలాంటి అనుమతులు లేవని, ఎవరైనా కోడిపందేలను నిర్వహిస్తే వారిపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

ఈదరలో బరులు ధ్వంసం

ఆగిరిపల్లి: కోడి పందేలు, పేకాట నిర్వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్ఐ శుభశేఖర్ హెచ్చరించారు. సంక్రాంతి సందర్భంగా ఈదర గ్రామంలో ఏర్పాటు చేసిన కోడిపందేల బరులను ఎస్ఐ శుభశేఖర్ ఆధ్వర్యంలో సిబ్బంది ధ్వంసం చేశారు. యువత జూదాలకు దూరంగా ఉండాలని, సంప్రదాయ క్రీడలు వైపు ఆసక్తి చూపాలని సూచించారు.

● తిరువూరు: స్థానిక తోకపల్లిలోని మామిడితోటలో సంక్రాంతి జూదాల నిర్వహణకు చేసిన ఏర్పాట్లను పోలీసులు ఆదివారం అడ్డుకున్నారు. కోడిపందాలు, పేకాట తదితర జూదాల నిర్వహణకు వేసిన టెంట్లను, జూదాల బరి చుట్టూ వేసిన ఫెన్సింగ్‌ను ఎస్ఐ సత్యనారాయణ, సిబ్బంది తొలగించారు. జూదాలు నిర్వహించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన

నూజివీడు: పేదల ఆరోగ్య భద్రతకు ప్రభుత్వం కృషి చేస్తోందని రాష్ట్ర గృహ నిర్మాణ, సమాచార శాఖ మంత్రి కొలుసు పార్థసారథి అన్నారు. నూజివీడులోని ఎంఆర్ అప్పారావు కాలనీలో అమెరికన్ హాస్పటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత మెగా వైద్య శిబిరాన్ని ఆదివారం ఏలూరు ఎంపీ పుట్టా మహేష్ కుమార్‌తో కలిసి రాష్ట్ర మంత్రి పార్థసారథి ప్రారంభించారు. వైద్య శిబిరంలో జనరల్, కంటి పరీక్ష, గుండె పరీక్ష, ఊపిరితిత్తుల పరీక్ష విభాగాలను సందర్శించి వైద్య పరీక్షల గురించి అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో పలువురు వైద్యులు, స్థానిక నాయకులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

ప్రతాప్ అప్పారావు పరామర్శ



కలపాల రంగారావు కుటుంబాన్ని పరామర్శిస్తున్న మాజీ ఎమ్మెల్యే ప్రతాప్

ఆగిరిపల్లి: వైఎస్సార్ సీపీ కార్యకర్తలను మాజీ ఎమ్మెల్యే మేకా వెంకట ప్రతాప్ అప్పారావు ఆదివారం పరామర్శించారు. నరసింగపాలెంకి చెందిన అలుగుల బాలసుందరం అనారోగ్యంతో బాధపడుతున్నాడని తెలిసి అతడి ఇంటికి వెళ్లి పరామర్శించి ఆరోగ్య వివరాలు అడిగి తెలుసుకున్నారు. తోటపల్లిలో ఇటీవల అనారోగ్యంతో మృతిచెందిన కలపాల రంగారావు కుటుంబాన్ని పరామర్శించి ధైర్యం చెప్పారు. రంగారావు చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయా కార్యక్రమాల్లో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బెజవాడ రాంబాబు, జిల్లా ఉపాధ్యక్షుడు పల్లగాని నరసింహారావు, ఎంపీటీసీ చింతా శ్యామలాదేవి, పార్టీ మండల యూత్ అధ్యక్షుడు బెజవాడ శ్రీహర్ష, గ్రామ పార్టీ అధ్యక్షుడు శివ, నాయకులు సింహాద్రి నాగబాబు, హనుమంతరావు, వాకా సక్కేశ్వరరావు, శ్రీమన్నారాయణ పాల్గొన్నారు.

నిరుపయోగంగా వర్మీకంపోస్టు తయారీ కేంద్రం



మైలవరం మార్కెట్ యార్డులో నిరుపయోగంగా ఉన్న వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం

మైలవరం: మైలవరం వ్యవసాయ మార్కెట్ యార్డు ప్రాంగణంలో ఏర్పాటు చేసిన వర్మీ కంపోస్టు తయారీ కేంద్రం నిరుపయోగంగా మారింది. రసాయనిక ఎరువులు వినియోగించడం వలన సారవంతమైన వ్యవసాయ భూములు మట్టిలోని సహజమైన ఖనిజాలను కోల్పోతున్నాయి. దీనితో మైలవరం మార్కెట్ యార్డు ప్రాంగణంలో 2001లో వర్మీ కంపోస్టు తయారీ కేంద్రాన్ని ఏర్పాటు చేశారు. మార్కెట్ యార్డు ప్రాంగణంలోనే ప్రతి శుక్రవారం నిర్వహించే పశువుల సంతలో పశువుల పేడను సేకరించి తద్వారా వర్మీ కంపోస్టును తయారు చేసి ఈ విధంగా తయారైన సేంద్రియ ఎరువును రైతులకు తక్కువ ధరకు అందుబాటులోకి తీసుకురావాలనే ఉద్దేశంతో దీనిని ఏర్పాటు చేశారు. సేంద్రియ ఎరువుల వినియోగం వలన భూమి సారవంతంగా మారి ఎక్కువ పంట దిగుబడికి ఉపయోగపడుతుంది. రూ.47 వేలతో షెడ్లు నిర్మాణం చేపట్టారు. షెడ్లలో తొట్టిలు నిర్మించి వాటిలో పశువుల పేడ వేసి వానపాములను వేసేవారు. పది రోజుల్లో వర్మీ కంపోస్టు తయారయ్యేది. ఈ విధంగా తయారైన సేంద్రియ ఎరువును రైతులకు అందుబాటులోకి తీసుకువచ్చేవారు. రైతులు కూడా సేంద్రియ ఎరువు వినియోగంపై ఆసక్తి కనబర్చారు. ప్రస్తుతం అధికారంలో ఉన్న ప్రభుత్వం దీనిపై దృష్టి సారించకపోవడం దురదృష్టకరమని రైతులు వాపోతున్నారు.

అందుబాటులోకి తీసుకురావాలి



నాకు వ్యవసాయ భూమి ఉంది. కేంద్రం ప్రారంభించిన కొత్తలో ఈ ఎరువులనే వాడేవాడిని. దీని వలన భూమి సారవంతంగా ఉండేది. పంటలు కూడా ఎక్కువ దిగుబడి వచ్చేది. ప్రస్తుతం ఇది మూలన పడి ఉండటంతో రసాయన ఎరువుల వాడకం తప్పడం లేదు. అందుబాటులోకి తేవాలి.

– డి. చలపతిరావు, పొందుగల

మినీ గోకులం షెడ్డు ప్రారంభం



శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ తదితరులు

కేతనకొండ(ఇబ్రహీంపట్నం): కేతనకొండ గ్రామంలో మహాత్మాగాంధీ జాతీయ ఉపాధి హామీ పథకం నిధులతో నిర్మించిన మినీ గోకులం షెడ్డును ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ ఆదివారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ మండలంలో 27 గోకులాల షెడ్ల నిర్మాణానికి రూ.57.50 లక్షలు మంజూరు చేశామన్నారు. రెండు నుంచి ఆరు పశువులు కలిగిన రైతులు, 50 గొర్రెలు కలిగిన వారు ఉపాధి హామీ పథకం నిధులతో మినీ గోకులం షెడ్లు నిర్మించుకోవచ్చని చెప్పారు. ఎంపీపీ పాలడుగు జోత్స్న, సర్పంచి నెలకుర్తి నళినీ ఆశాలత, వార్డు సభ్యులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

మినీ గోకులం ప్రారంభం

ముసునూరు: పశుపోషకుల ఆర్థికాభివృద్ధికి భరోసానిచ్చే విధంగా రాష్ట్ర వ్యాప్తంగా 12,500 మినీ గోకులాలను నిర్మించామని రాష్ట్ర సమాచార, గృహ నిర్మాణ శాఖా మంత్రి కె.పార్థసారథి అన్నారు. సూరేపల్లిలో నిర్మితమైన గోకులాన్ని ఆదివారం ఆయన ప్రారంభించి మాట్లాడుతూ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో భాగంగా మినీ గోకులాలను నిర్మిస్తున్నామని చెప్పారు. గోకులం ఏర్పాటు చేసుకునే రైతులు 10 శాతం పెట్టుబడి పెట్టుకుంటే ప్రభుత్వం 90 శాతం సబ్సిడీ అందిస్తోందని, దీనిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ సుధారాణి, మాజీ సర్పంచ్ చల్లగుళ్ల నాగమల్లేశ్వరరావు, స్థానిక ప్రజాప్రతినిధులు, పశుపోషకులు పాల్గొన్నారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

మైలవరం: మైలవరం నియోజకవర్గంలో 24 మందికి ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి రూ.18.07 లక్షలు మంజూరయ్యాయి. మరో ఐదుగురికి లెటర్ ఆఫ్ క్రెడిట్ (ఎల్ఓసీ) కింద రూ.9.30 లక్షలు మంజూరయ్యాయని మైలవరం ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ కార్యాలయం ఆదివారం తెలిపింది. సీఎంఆర్ఎఫ్ చెక్కులను ఎమ్మెల్యే వసంత వెంకట కృష్ణప్రసాద్ లబ్ధిదారులకు ఆదివారం ఆయన కార్యాలయంలో అందజేశారు.

● తిరువూరు: మండలంలోని పలువురు లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావు ఆదివారం తిరువూరులో పంపిణీ చేశారు. రూ.5.79 లక్షల విలువైన చెక్కులను లబ్ధిదారులకు అందజేశామని ఎమ్మెల్యే కార్యాలయం తెలిపింది.

విద్యుత్ బిల్లులు దహనం

తిరువూరు: కూటమి ప్రభుత్వం ప్రజలకిచ్చిన హామీలను గాలికొదిలి విద్యుత్ చార్జీలు పెంచడం గర్హనీయమని, వెంటనే పెంచిన చార్జీలు తగ్గించాలని కోరుతూ తిరువూరు భగత్‌సింగ్ నగర్ కాలనీ వాసులు ఆదివారం విద్యుత్ బిల్లులు దహనం చేశారు. సీపీఎం ఆధ్వర్యంలో జరిగిన ఆందోళనా కార్యక్రమంలో పట్టణ కమిటీ సభ్యుడు చప్పిడి సురేష్ మాట్లాడుతూ పేదలపై పెనుభారం మోపుతున్న కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో ఇచ్చిన హామీ మేరకు విద్యుత్ చార్జీలు తగ్గించాలని డిమాండ్ చేశారు. నాయకులు బీఆర్ తులసీరావు, ఆకుల రవి, రాము, బాబు తదితరులు పాల్గొన్నారు.

వివేకానందుని బోధనలు స్ఫూర్తిదాయకం



తిరువూరు: స్వామి వివేకానంద బోధనలు యువతకు స్ఫూర్తి దాయకంగా నిలుస్తాయని తిరువూరు వాహినీ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ రంగా నాగేంద్రబాబు అన్నారు. కళాశాలలో ఆదివారం వివేకానంద జయంతి నిర్వహించారు. అధ్యాపకులు స్వామి వివేకానంద విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఉత్తమ పౌరులుగా ఎదగడానికి వివేకానంద బోధనలను పాటించాలని నాగేంద్రబాబు సూచించారు. శ్రీనిధి స్కూల్‌లో వివేకానంద జయంతి కార్యక్రమంలో కరస్పాండెంటు కిశోర్, ప్రిన్సిపాల్ వెంకటనారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు. రాజుపేటలోని బీజేపీ కార్యాలయంలో వివేకానందుడి చిత్రపటానికి పార్టీ నాయకులు దేశిరెడ్డి వెంకటేశ్వరరెడ్డి, చెన్నోజు శ్రీనివాసాచారి, నాళ్ళా సురేష్ పూలమాల వేసి నివాళులర్పించారు.

నూజివీడులో..

నూజివీడు: స్వామి వివేకానంద జయంతి వేడుకలు బీజేపీ నూజివీడు పట్టణ అధ్యక్షురాలు మల్లెపూడి నాగరాణి ఆధ్వర్యంలో ఆదివారం నిర్వహించారు. బాపునగర్ రామకృష్ణ సేవా సమితి ఆవరణలోని స్వామి వివేకానందుని విగ్రహానికి నాగరాణి పూలమాల వేసి నివాళులర్పించారు. పార్టీ నాయకుడు బోను అప్పారావు, సమితి ప్రతినిధి భాస్కర్ జీ మాట్లాడుతూ వివేకానందుని బోధనలు భావితరాలకు స్ఫూర్తిదాయకమని కొనియాడారు. ఆయనను స్ఫూర్తిగా తీసుకుని యువత ముందుకు సాగాలని పేర్కొన్నారు.

అపూర్వం.. ఆత్మీయ సమ్మేళనం

విస్సన్నపేట జెడ్పీ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు



ఆగిరిపల్లి జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థులు



ఆగిరిపల్లి: ఆగిరిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2009–2010 పదో తరగతి బ్యాచ్ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం ఆదివారం జరిగింది. వివిధ ప్రాంతాల్లో స్థిరపడిన వారంతా 15 ఏళ్ల తర్వాత తాము చదువుకున్న పాఠశాలలో కలుసుకున్నారు. ఒకరినొకరు ఆప్యాయంగా పలకరించుకొని యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. చిన్ననాటి జ్ఞాపకాలను నెమరువేసుకుని రోజంతా ఆటపాటలతో ఉత్సాహంగా గడిపారు. అనంతరం తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులు ఎంతఊట సర్వేశ్వరరావు, పాఠశాల ప్రధానోపాధ్యాయిని పుష్పలత, ఉపాధ్యాయులు రామకృష్ణ, అల్లాబక్షు, శారద, అన్నపూర్ణ, రాఘవులు, అపర్ణ తదితరులను పూర్వ విద్యార్థులు ఘనంగా సత్కరించారు.

● విస్సన్నపేట: విస్సన్నపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో 2000–2001 విద్యాసంవత్సరంలో పదో తరగతి చదివిన పూర్వ విద్యార్థులు ఆదివారం కలుసుకున్నారు. పాఠశాలలో తాము చదువుకున్న నాటి స్మృతులను నెమరువేసుకున్నారు. తమకు విద్యనందించిన ఉపాధ్యాయులను సన్మానించారు.

ఘనంగా గొల్లపల్లి హైస్కూల్ వజ్రోత్సవం



నూజివీడు: పూర్వ విద్యార్థులందరూ కలిసి ప్రభుత్వ పాఠశాలలను అభివృద్ధి చేసుకోవాలని ఏలూరు ఎస్పీ కొమ్మి ప్రతాప శివ కిశోర్ అన్నారు. గొల్లపల్లిలోని శ్రీ అన్నే రామకృష్ణయ్య జిల్లా పరిషత్ హైస్కూల్ వజ్రోత్సవాలను ఆదివారం ఘనంగా నిర్వహించారు. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఎస్పీ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలు ఎందులోనూ తీసిపోవన్నారు. ఉపాధ్యాయులు కూడా అంకితభావంతో పనిచేయాలని, పిల్లలకు విద్యాబుద్ధులు, నైతిక విలువలు నేర్పాలని చెప్పారు. పూర్వ విద్యార్థుల్లో ఉన్నత స్థానాల్లో ఉన్న వారి మద్దతుతో హైస్కూల్‌ను మరింత అభివృద్ధి చేసుకోవాలన్నారు. అనంతరం హైస్కూల్‌లో చదువులో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు బహుమతులను ఎస్పీ చేతుల మీదుగా అందజేశారు. హైస్కూల్ హెచ్ఎం పొట్లూరి రాధికారాణి, ఎస్ఎంసీ చైర్మన్ బావిశెట్టి వీరయ్య, వజ్రోత్సవ కమిటీ నిర్వాహకులు అవిర్నేని వెంకటేశ్వరరావు, మాజీ సర్పంచి గోగినేని శ్రీనివాస కుమార అప్పారావు, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

కోడిపందేల నిర్వహణకు అనుమతి ఇవ్వొద్దు

నూజివీడు: సంక్రాంతి పండుగ నేపథ్యంలో గ్రామీణ ప్రాంతాల్లో కోడి పందేల్లాంటి అసాంఘిక కార్యకలాపాలకు ఏమాత్రం అనుమతి ఇవ్వకూడదని సీపీఐ నూజివీడు నియోజకవర్గ సమితి ప్రభుత్వాన్ని కోరింది. ఈ మేరకు సీపీఐ రాష్ట్ర నాయకులు చలసాని రామారావు ఆదివారం ఒక ప్రకటన విడుదల చేశారు. గ్రామీణ ఆర్థిక వ్యవస్థతో కళకళలాడే ప్రజల జీవితాల్లో ఆనందోత్సాహాలను, కొత్త వెలుగుల్ని ఇవ్వమని ప్రకృతిని కోరే పండగే సంక్రాంతి అని, ఇలాంటి గ్రామీణ పండుగల్లో సైతం పెట్టుబడుదారీ వ్యవస్థ ప్రవేశించి జూదం, తాగుడు వంటి అనాచారం ప్రవేశించి వినోదం కాస్త విషాదమై పోతోందని ఆవేదన వ్యక్తంచేశారు. సంప్రదాయ క్రీడలైన కబడ్డీ, వాలీబాల్, మోకులాగుడు, ముగ్గుల పోటీలు లాంటి క్రీడలు నిర్వహించేలా అధికారులు చర్యలు చేపట్టాలని కోరారు.